ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5

మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
సోమవారం 30 జూన్ 2025


కోస్గి బస్ డిపో ఇన్‌చార్జి బాలయ్య ఇచ్చిన వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలలకే.. జై

- వాటివైపు విద్యార్థుల తల్లిదండ్రుల మొగ్గు
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు గవర్నమెంట్ స్కూళ్లలో 42,695 మంది చేరిక
- ప్రైవేట్ నుంచి వచ్చిన వారి సంఖ్య 4,937
- ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటులో ఒక్కరూ చేరలేదు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో ఏటా ఫీజులు పెరుగుతుండగా, మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందడంతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం అందిస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను గవర్నమెంట్ బడుల్లో చదివించేందుకే మొగ్గు చూపుతున్నారు. పదో తరగతిలో గత ఏడాది ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరగడం, ఏఐ బోధన అందించడం, వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారిస్తున్నారు. దాంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోంది.

42,695 మంది విద్యార్థులు అడ్మిషన్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ఏడాది కంటే ఈ సారి ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. మొత్తం 42,695 మంది విద్యార్థులు గవర్నమెంట్ బడుల్లో అడ్మిషన్లు పొందారు. ఒకటో తరగతిలో 18,607 మంది చేరగా, ప్రైవేట్ పాఠశాలల నుంచి రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు 4,947 మంది విద్యార్థులు చేరారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలల్లో ఒక్కరు కూడా చేరలేదని విద్యాశాఖ లెక్కలు చెబుతున్నాయి. 19,151 మంది విద్యార్థులు స్కూల్స్ మారినా.. తిరిగి పక్క జిల్లాలు, ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరారని తెలుపుతున్నాయి.


మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో హిందీ పదాలు చదివిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

జిల్లాల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల వివరాలు

జిల్లా	ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు	ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన వారు	ప్రభుత్వ పాఠశాలల నుంచి తిరిగి వాటిలోనే చేరిన వారు
మహబూబ్‌నగర్	4109	1195	4613
నారాయణపేట	4076	909	3473
నాగర్‌కర్నూల్	4128	864	4021
జోగుళాంబ గద్వాల	3709	485	3011
వనపర్తి	2585	1484	4033

పాలమూరు జిల్లాలోనే అధికం..

ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్ జిల్లాలోనే అధికంగా 9,917 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లాలో 9,013 మంది, నారాయణపేట జిల్లాలో 8,458, వనపర్తి జిల్లాలో 8102, జోగుళాంబ గద్వాల జిల్లాలో 7,205 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు.

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగింది



నాణ్యమైన విద్య అందడం, పదో తరగతిలో మంచి ఫలితాలు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగింది. అందుకే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ప్రైవేటు పాఠశాలల నుంచి గవర్నమెంట్ స్కూల్స్‌లో చేరికలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల నుంచి ఒక్కరూ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లలేదు.

– బైకాని బాలుయాదవ్, సీఎంవో, మహబూబ్‌నగర్ జిల్లా

కోస్గి డిపోకు 10 బస్సులు మంజూరు చేయాలి

- సీఎంకు వినతి పత్రం ఇచ్చిన డిపో ఇన్‌చార్జి

కోస్గి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కోస్గి బస్ డిపోకు 10 బస్సులను మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి డిపో ఇన్‌చార్జి బాలయ్య ఆదివారం వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి, విన్నవించారు. డిపోలో బస్సులు లేక పోవడంతో తిరుపతి, శ్రీశైలం, మంత్రాలయం, యాదగిరిగుట్ట వంటి దూర ప్రాంతాలకు నడిపేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలో బస్సులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని బాలయ్య తెలిపారు.

ఉద్యమానికి ఊపిరైన పాట

- పాటల పల్లకిలో 12 గంటల కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): 'ఎన్నో ఆశలు ఆకాంక్షలతో తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం కొందరి చేతిలో బందీ అయ్యింది. బతుకమ్మ అంటే కల్వకుంట్ల వారి ఇంటి ఆడపడచయ్యింది. ఉద్యమకారులంటే వారి కొడుకు, అల్లుడయ్యారు. గోసి గొంగడేసి, కాలి గజ్జెకట్టి ఊరువాడ తిరిగి పోరుపాటలు పాడిన కళాకారులు కాలేకడుపులతో అల్లాడుతున్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని అంబేడ్కర్ కళాభవన్‌లో తెలంగాణ కళాకారుల ఆధ్వర్యంలో పాటల పల్లకిలో 12 గంటల కార్యక్రమాన్ని నిర్వహించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, కళాకారులను ఉద్దేశించి మాట్లాడారు. మీ పాటలేనిదే తెలంగాణ ఉద్యమం లేదన్నారు. గూడ అంజన్న, అందెశ్రీ, జయరాజ్, గోరటి వెంకన్నల కలాలకు మీ గళంతోడై ఉద్యమ ఆకాంక్షలను ప్రతి పల్లెకు, గడపకు తీసుకెళ్లారన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం కళలపై, కళాకారులపై నిర్బంధం విధించిందన్నారు. వారిపై అక్రమ కేసులు బనాయించిందన్నారు. ప్రజా ప్రభుత్వం అందుకు భిన్నంగా కళాకారుల పట్ల సానుకూల దృక్పథంతో ఉందన్నారు. ఉద్యమంలో పని చేసిన కళాకారులను ఏకం చేసేందుకు పార్టీలకు అతీతంగా హైదరాబాద్‌లో ధూంధాం నిర్వహించాలని కళాకారులకు సూచించారు. మీ సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకవెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల ఆట పాటలు, డప్పుల చప్పుళ్లతో అంబేద్కర్ కళాభవన్ మారుమోగింది. కార్యక్రమంలో ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, డీసీసీ కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, ఉద్యమ కవి, గాయకుడు నేర్నాల కిషోర్, టీపీసీసీ సాంస్కృతిక సేన అధ్యక్షుడు చక్రాల రఘు, కళాకారులు పాల్గొన్నారు.

గెలుపు ఓటములు సహజం


పోటీలను ప్రారంభిస్తున్న పద్మాచారి

- తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్ పద్మచారి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్ పద్మాచారి అన్నారు. జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పసుకృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు పతకాలు అందజేశారు. ఓవరాల్ చాంపియన్ హైదరాబాద్‌కు దక్కగా, ద్వితీయ స్థానంలో రంగారెడ్డి, తృతీయ స్థానంలో హన్మకొండ నిలిచాయి. పతకాలు సాధించిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు నచ్చిన క్రీడను ఎంపిక చేసుకొని, రాణించాలన్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. కిక్ బాక్సింగ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ 7 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయస్కుల విభాగంలో పోటీలు నిర్వహించామని, వివిధ విభాగాల్లో ఆయా జిల్లాల క్రీడాకారులు పతకాలు సాధించారని చెప్పారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, మహిపాల్, కోశాధికారి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు, టోర్నీ ఆర్గనైజర్ రవికుమార్, కార్యదర్శి రవినాయక్, సలహాదారులు జయంత్‌కుమార్, పద్మచారి, శ్రీనివాస్, రఘువీర్ ప్రతాప్, హరిసింగ్, మహబూబ్‌నగర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ శాంత పాల్గొన్నారు.

డెడ్‌లైన్ ఆగస్టు 15

- ఆ లోగా భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి
- తహసీల్దార్లకు నారాయణపేట కలెక్టర్ ఆదేశం
- జిల్లాలో వచ్చిన మొత్తం దరఖాస్తులు 4,052


భూ భారతి దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్(ఫైల్)

నారాయణపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి అమలులో భాగంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులకు నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 4,052 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా నారాయణపేట మండలం నుంచి 1,230 దరఖాస్తులు రాగా.. అత్యల్పంగా నర్వ మండలం నుంచి 107 దరఖాస్తులు వచ్చాయి. అయితే మొదట పైలట్ ప్రాజెక్టు కింద మద్దూర్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆ తర్వాత జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సభలు ఏర్పాటు చేసి, భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీవో రాంచందర్ పర్యవేక్షణలో సదస్సులు నిర్వహించారు. ప్రస్తుతం సదస్సులు ముగియడంతో దరఖాస్తుల పరిశీలనలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఆలోగా పరిష్కరించాలి

భూభారతి దరఖాస్తులన్నింటినీ ఆగస్టు 15లోపు పరిష్కరించాలని తహసీల్దార్‌ల సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఆదేశించారు. ఏవైనా వివాదస్పంతో పాటు జఠిలమైన సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ నేపథ్యంలో అధికారులు దరఖాస్తుల పరిశీలనలో తలమునకలయ్యారు. ఎంతోకాలంగా భూ సమస్యలతో సతమతం అవుతున్న రైతాంగం ఇకనైనా పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నారు.

మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఇలా..

మండలం	దరఖాస్తులు
నారాయణపేట	1,230
దామగిద్ద	618
ధన్వాడ	232
గుండుమాల్	149
కోస్గి	196
కోత్తపల్లి	197
కృష్ణా	152
మాగనూర్	264
మక్తల్	180
మరికల్	311
ఊట్కూర్	416

ఆన్‌లైన్‌లో నమోదు

అధికంగా సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి. వాటితో పాటు సర్వే నంబర్ల గల్లంతు, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని, డిజిటల్ సంతకాల మిస్సింగ్, వారసత్వ సమస్యలు, పట్టాదార్ పాస్ బుక్కుల్లో పేర్లు తేడాలు ఉండటం, భూవిస్తీర్ణంలో హెచ్చు తగ్గులు ఉండటం తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. వాటిని మండలాల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రస్తుతం ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పరిష్కరిస్తామని, కోర్టు పరిధిలో ఉన్నవి కోర్టు నిర్ణయాలను బట్టి చర్యలు తీసుకుంటామని అధికారులు అంటున్నారు.

దేవరకద్రకు కోర్టు మంజూరు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

దేవరకద్ర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దేవరకద్ర మునిసిపాలిటీకి కోర్టు మంజురైనట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కోర్టు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి సివిల్ కోర్టును మంజూరు చేయించారన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గం ఏర్పడి 16 ఏళ్లు గడుస్తున్నాయన్నారు. ఈ ప్రాంత ప్రజలు వివిధ కేసుల నిమిత్తం మహబూబ్‌నగర్, ఆత్మకూర్ కోర్టులకు తిరుగుతున్నారన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా కోర్టు మంజూరు చేయించినట్లు తెలిపారు. దీంతో నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు జరుగనుందన్నారు.

జై తెలంగాణ అనని వ్యక్తి రాష్ట్రానికి సీఎం అయ్యాడు


విగ్రహావిష్కరణ సందర్భంగా కంటతడి పెట్టుకున్న సాయిచంద్ సతీమణి రజినిని ఓదార్చుతున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి

అమరచింత/ఆత్మకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రాంత పేద ప్రజల విముక్తి కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రానికి, ఒక్క రోజు కూడా జై తెలంగాణ అనని వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యాడని మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. వనపర్తి జిల్లా, అమర చింతలో ఆదివారం రాత్రి జరిగిన 'సాయిచంద్ యాదిలో' సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సాయిచంద్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి రజిని కంటతడి పెట్టుకున్నారు. దీంతో మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు ఆమెను ఓదార్చారు. అనంతరం నిర్వహించిన సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ ఈ రోజు సాయిచంద్ ఉండి ఉంటే జై తెలంగాణ అనే వ్యక్తి సీఎం అయ్యాడని బాధ పడేవాడని ఆవేదన వ్యక్తం

మిగతా 6లో..

రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలి

- జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి
- జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర
- ఉత్సాహంగా జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర అన్నారు. వరంగల్‌లో జూలై 6న నిర్వహించనున్న తెలంగాణ అంతర్ జిల్లాల అండర్-10, 12, 14 అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను ఆదివారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. టోర్నీలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులకు శిబిరం నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీలు రమేష్‌బాబు, సి.శ్రీనివాసులు, ధర్మేంద్ర, సత్యనారాయణ, రాకేష్, అథ్లెటిక్స్ కోచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బెల్టులు సాధించిన విద్యార్థులతో మాస్టర్ వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మోడల్ బేసిక్ స్కూల్‌లో విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఫౌండర్ వెంకటేశ్ మాట్లాడుతూ కరాటే పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు అందజేసినట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పాఠశాల ఆవరణలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందజేస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులకు బెల్టులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ వర్షిని, వెంకటేశ్, శ్రీధర్, నాగరాజు పాల్గొన్నారు.

జై తెలంగాణ అనని వ్యక్తి రాష్ట్రానికి సీఎం అయ్యాడు

(5వ పేజీ తరువాయి)

చేశారు. కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయడం, బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే సాయిచంద్‌కు నిజమైన నివాళి అన్నారు. రాతి బొమ్మల్లో కొలువైన శివుడా అనే పాటకు లెక్కలేనన్ని సార్లు తను స్వయానా రాష్ట్ర ప్రజలు సైతం కంట తడి పెట్టారని ఆయన గుర్తు చేశారు. సాయిచంద్ ఆశయాలను ఆయన భార్య రజిని కొనసాగిస్తానని ముందుకు రావడం గర్వంగా ఉందని తెలిపారు. సాయిచంద్ లేని లోటు తీరనిదని, ఆయన విగ్రహాన్ని నా చేతుల మీదుగా ఆవిష్కరించడం చాలా బాధాకరమని అన్నారు.

మళ్లీ ఆంధ్రుల పరోక్ష పెత్తనం


తెలంగాణ రాష్ట్రంలో పరోక్షంగా మళ్లీ ఆంధ్రుల పెత్తనం ప్రారంభమైందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. ఈ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే ఆంధ్రవారు గర్వంగా ఫీల్ అవుతున్నారని ఎద్దేవా చేశారు. గోదావరి నీళ్లను బనకచర్ల ప్రాజెక్టు ద్వారా తరలించేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ. సాయిచంద్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దుర్మార్గ పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడటానికి సాయిచంద్ పాట ఉంటే బాగుండేదని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు గొంగడి సునీత, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, ఎస్సార్ రెడ్డి సభలో మాట్లాడుతూ... సాయిచంద్ లేనిదే కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సభలు పెట్టేవారు కాదు.. ఆయన లేని లోటు తీరనిదని అన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా మిట్టపల్లి సురేందర్ గానం

సభలో ఉద్యమ గాయకుడు మిట్టపల్లి సురేందర్ తాను రాసిన 'పాలమూరు పిల్లవాడు బయలుదేరెనే/ ప్రపంచ వేదికపై అమరచింత పిల్లవాడు ఎల్లలు దాటెనో' పాటను పాడి వినిపించారు. ఆ తరువాత సాయిచంద్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చి పెట్టిన 'రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా' అనే పాట కూడా పాడి సభికులను ఉత్సాహపరిచాడు. కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, నాయకులు మాజీ ఎమ్మెల్యేలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, జైపాల్ యాదవ్, ఎస్ఆర్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇంతియాజ్, విశాఖ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి టీఆర్ఎస్ శ్రేణులు ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

విహార యాత్రలో విషాదం

- కృష్ణానదిలో మునిగి యువకుడి మృతి
- స్నేహితులతో సోమశిలకు వచ్చిన యువకుడు



కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో భరత్ మృతదేహం వద్ద రోదిస్తున్న స్నేహితులు

కొల్లాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అడవిలో గలగలా పారుతున్న కృష్ణానది అందాలను తిలకించేందుకు స్నేహితులతో కలిసి విహార యాత్రకు వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నదిలో మునిగి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామంలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. కొల్లాపూర్ ఎస్ఐ హృషికేష్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూల్ జిల్లా నుంచి ముగ్గురు యువకులు శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కారులో సోమశిల గ్రామానికి చేరుకొని అక్కడే ఉన్న రెస్టారెంట్‌లో బస చేశారు. ఉదయం 6:30 గంటల సమయంలో కృష్ణానది వీఐపీ ఘాట్‌కు చేరుకొన్నారు. ముందుగా భరత్ (27) అనే యువకుడు నీటిలో దిగాడు. పారుతున్న నీటిలో ఈత కొట్టలేక మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు వెంటనే నదిలోకి అతడిని ఒడ్డుకు తీసుకొచ్చి, తమ కారులోనే కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతి చెందిన భరత్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నట్లు స్నేహితులు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు కొల్లాపూర్‌కు చేరుకున్నారు. అప్పటికే పోలీసులు అక్కడికి వచ్చారు. మృతదేహానికి పోస్టు మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హృషికేష్ తెలిపారు.

రైతు వేదికకు రాని రైతులు

- భారంగా మారుతున్న రైతు వేదిక నిర్వహణ
- వీసీ యూనిట్లను కాపాడడానికి అధికారుల తంటాలు
- నామమాత్రంగా సాగిన సీఎంతో రైతుల ముఖాముఖి



కమలొద్దిన్‌పూర్ రైతు వేదికలో సీఎం ప్రసంగం వింటున్న కొద్ది మంది రైతులు

ఖిల్లాఘణపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రైతు వేదికల్లో నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌లను వీక్షించడానికి రైతులు రావడానికి సుముఖంగా ఉండడం లేదు. వానకాలం రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న ప్రారంభం రోజు, ముగింపు రోజు రైతువేదికల్లో సీఎంతో లబ్ధిదారులకు జరిగే ముఖాముఖి సమావేశానికి రైతుల హాజరు నామమాత్రంగా ఉంది. రైతు వేదికల్లో జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ఏఈవో(అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ అధికారి) రైతులను తరలించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ రైతు వేదికలో 200 మంది రైతులను తరలించడానికి ఉన్నతాధికారులు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసిన క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధుల, నాయకుల సహకారం లేకపోవడంతో సాధ్యం కావడంలేదు. గత ప్రభుత్వ హయాంలో ఒక రైతు వేదిక నిర్మాణానికి రూ.22.50 లక్షలు ప్రభుత్వ నిధులు ఖర్చు చేసింది. వనపర్తి జిల్లాలో 71 రైతు వేదికల్లో 71 మంది ఏఈవోలు విధులు నిర్వహిస్తున్నారు. 44 రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాలు వీసీ ద్వారా ప్రతీ మంగళవారం పంట సాగులో సమస్యల పరిష్కారానికి రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్త ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతు నేస్తం కార్యక్రమానికి గ్రామంలో ఆసక్తి ఉన్న కొంతమంది రైతులు మాత్రమే హాజరవుతున్నారు.

భారంగా నిర్వహణ

రైతు వేదికలను గ్రామాలకు దూరంగా నిర్మించడంతో వాటికి తాగునీటి సౌకర్యం లేకపోవడం, రైతు వేదికలను కనీసం శుభ్రం చేసి, కుర్చీలు వేసే సిబ్బంది లేకపోవడంతో ఏఈవోలే సొంత నిధులు ఖర్చు చేస్తుండడంతో రైతు వేదికల నిర్వహణ భారంగా మారింది. ఇటీవల వనపర్తి జిల్లాలో మూడు రైతు వేదికల్లో చోరీలు జరిగాయి. ఖిల్లాఘణపురం, పెద్దమందడి మండలం వెల్టూరు, ఏదుల మండల కేంద్రంలో రూ.5 లక్షలతో ప్రభుత్వ నిధితో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ (విసి) యూనిట్లు సరైన భద్రత లేకపోవడంతో వారం రోజుల వ్యవధిలో వరుసగా చోరీలు జరిగాయి. గ్రామానికి దూరంగా ఉన్న రైతు వేదికల వద్ద కనీసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో దొంగతనాలు సర్వసాధారణంగా మారాయి.

ఏఈవోల పని భారం

రైతు వేదికలో ఏఈవో విధులు నిర్వహిస్తుంటారు. పంటలకు సంబంధించి రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడంతో పాటు సాగులో సమస్యలు తలెత్తితే పరిష్కరించడం వారి బాధ్యత. పీఎం కిసాన్ యోజన, కెవైసీ డాక్యుమెంట్ల వెరిఫికేషన్, రైతు విశిష్ట సంఖ్య నమోదు, పంటల వివరాలు నమోదు చేయడం, రైతు బంధు, రైతు బీమా నమోదు, వ్యవసాయానికి సంబంధించి మట్టి నమూనాలు సేకరించడం రైతు వేదికల నిర్వహణ బాధ్యతలు నిర్వహించాలి.

రైతు నేస్తం కొన్ని గ్రామాలకే పరిమితం



రైతు వేదికల్లో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాలు రైతు నేస్తం వీక్షించడానికి కొన్ని గ్రామాలకే పరిమితం చేశారు. వీసీలో పాల్గొనాలంటే మా గ్రామ రైతులు 15 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి రావడంతో ఆసక్తి చూపడం లేదు. పంట సాగు సమయంలో రైతులు అలసిపోయి ఉండడంతో ఏఈవోలు ఫోన్ చేసి పిలిచిన రైతు వేదిక గ్రామాలకు వెళ్లలేకపోతున్నారు.

- విష్ణు, రైతు, ఉప్పరిపల్లి

కార్యక్రమాల విజయవంతానికి కృషి చేస్తున్నాం



రైతువేదికలో నిర్వహించే కార్యక్రమాల్లో రైతులను భాగస్వామ్యం చేస్తూ విజయవంతం చేస్తున్నాం. ప్రతి రైతుకు చరవాణిలో సందేశాలు పంపుతూ, ప్రత్యేకంగా ఫోన్లు చేసి రప్పిస్తున్నాం. పంట సాగు సీజన్ కావడంతో రైతులు రైతు వేదికకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. క్లస్టర్ రైతువేదిక ఉన్న గ్రామంలోని రైతులు మళ్లీ రావడానికి సుముఖత చూపడం లేదు. కొన్ని గ్రామాల్లో జన సంచారం లేని ప్రాంతాల్లో రైతు వేదికలు ఉండడంతో భద్రత కరువైంది.

- మల్లయ్య, మండల వ్యవసాయ శాఖ అధికారి, ఖిల్లాఘణపురం

ఆడవారి జోలికొస్తే ఉపేక్షించేది లేదు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్, హరీశ్‌రావుపై కుట్రలు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి వి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆడవారి క్యారెక్టర్‌ను దెబ్బతీస్తూ వారిని అవమానపరిచే విధంగా మాధ్యమాల్లో అసభ్యకర ప్రసారాలు చేస్తే తెలంగాణ సమాజం ఉపేక్షించదని, అవసరమైతే ఎలాంటి కఠిన నిర్ణయాలకైనా వెనుకాడబోదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వారిపై జరుగుతున్న కుట్రలను చూసి కొందరు కార్యకర్తలు ఆవేశానికి లోనై ఓ టీవీ ఛానల్ కార్యాలయంపై నిరసన చేపట్టడం జరిగిందని, అది ప్లాన్‌తో చేసినది కాదని తెలిపారు. నాయకులపై ఉన్న అభిమానంతో నిరసన తెలిపారే తప్పా వ్యక్తులపై ఎలాంటి దాడులు చేయలేదన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీవీలలో కూర్చుని వాళ్లే మహిళలు, వారి క్యారెక్టర్‌లపై జడ్జిమెంట్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంత బరితెగించి చూయించడమేంటని ప్రశ్నించారు. దగ్గరుండి చూసినట్లుగా తప్పుడు ప్రసారాలు చేయవద్దని హితవు పలికారు. అక్కడ పలిగింది అద్దాలేనని, కానీ మీరు చేసే ప్రసారాలతో ఆడవాళ్ల గుండెలు పగులుతున్నాయని, ఇలానే మీ ఇంటి ఆడవారిపై ప్రసారాలు చేస్తే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. ఏ విచారణ సంస్థతో విచారణ చేసినా విచారణను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని, ఇలా ఆడవారి మనోభావాలని దెబ్బతీయవద్దని సూచించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులపై తప్పుడు కథనాలు అల్లి బదనాం చేయడం సరికాదని, విచారణలో వాస్తవాలు తేలుతాయన్నారు. సమావేశంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల తర్వాత అ'పూర్వ' సమ్మేళనం



గద్వాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్ పూర్వ విద్యార్థినులు

గద్వాల సర్కిల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గద్వాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థినులు 30ఏళ్ల తర్వాత ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. భావోద్వేగాలను పంచుకున్నారు. తాము చదివిన పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఈ సమ్మేళనంలో తాము కూర్చున్న తరగతి గదులను, అక్కడి పరిసరాలను చూస్తూ చిన్నానాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. విద్యనేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. జీహెచ్ఎం జహీరుద్దీన్, విశ్రాంత ఉపాధ్యాయులు రామతులసమ్మ, లక్ష్మీదేవి, కళావతి, సరోజ, సయ్యద్ అహ్మద్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాలువలు ఇలా.. నీరు పారేదెలా?

- అస్తవ్యస్తంగా ఎంజీకేఎల్ఐ కాల్వల నిర్మాణం
- పేరుకుపోయిన ముళ్ల పొదలు,జమ్ము
- చివరి ఆయకట్టుకు నీరందనిక పరిస్థితి
- ఆందోళనలో అన్నదాతలు



పెద్దకొత్తపల్లి శివారులో కేఎల్ఐ కాల్వలో మొలకెత్తిన జమ్ము, పిచ్చిమొక్కలు

పెద్దకొత్తపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకంలో కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రైతాంగానికి సాగునీరందించేందు కోసం తవ్విన కాల్వలో విపరీతంగా జమ్ము గడ్డి పెరిగి పొలాలకు నీరందే పరిస్థితి కానరావడం లేదు. పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్, జొన్నలబొగుడ, సాతాపూర్, కొత్తపేట, నారాయణపల్లి, చెన్నపురావుపల్లి, కల్వకోల్, నక్కలపల్లి, వెన్నచెర్ల తదితర గ్రామాల శివారులో ఎంజీకేఎల్ఐ ప్రధాన కాల్వలకు అనుసంధానంగా ఉన్న కాల్వలో పిచ్చి మొక్కలు జమ్ము గడ్డి విపరీతంగా పెరిగిపోయింది. దీంతో నీటి సరఫరా అంతరాయం కలిగే అవకాశం ఉంది. సీజన్ ప్రారంభమవడంతో కాల్వలో పేరుకుపోయిన జమ్ము, పిచ్చి మొక్కలను తొలగించకుంటే చివరి ఆయకట్టు రైతులకు నీరందని పరిస్థితి దాపురించిందని ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టర్ల పర్యవేక్షణ కొరవడంతో కాల్వలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కాల్వలో పెరిగిన పిచ్చి మొక్కలు జమ్మును తొలగించాలని ఎన్నోమార్లు అధికారులకు , ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నా పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకుని ఎంజీకేఎల్ఐ కాల్వలో పెరిగిన జమ్ము, పిచ్చి మొక్కలను తొలగించి కాల్వల ద్వారా నీటి సరఫరాకు ఆటంకం కలుగకుండా చూడాలని పలు గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జమ్మును తొలగించాలి



దేవునితిర్మలాపూర్, సాతాపూర్, జొన్నలబొగుడ, నక్కలపల్లి, చెన్నపరావుపల్లి తదితర గ్రామాల్లో శివారులో ఉన్న ఎంజీకేఎల్ఐ కాల్వలో జమ్ము, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి నీటి సరఫరాకు ఆటంకం కలిగే విధంగా ఉంది. కాల్వలో పెరిగిన జమ్మును పిచ్చి మొక్కలను తొలగించి నీటి సరఫరాకు ఆటంకం కలుగకుండా చూడాలి.

- తిరుమల్‌యాదవ్, రైతు సాతాపూర్

కాల్వలను శుభ్రపర్చాలి



ఎంజీకేఎల్ఐ కాల్వలో జమ్ము, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగింది. వాటిని తొలగించకుంటే నీటి సరఫరా సక్రమంగా జరిగే అవకాశం లేదు. కాల్వలో పేరుకుపోయిన జమ్మును పిచ్చి మొక్కలను తొలగించి కాల్వలను శుభ్రపర్చాలి.

- వడమోని బొజ్జన్న, రైతు, దేవునితిర్మలాపూర్



సాతాపూర్ శివారులో కేఎల్ఐ కాల్వలో మొలకెత్తిన జమ్ము

అలంపూర్‌లో సినీనటి పూజలు



స్వామి వారి ఆలయంలో అభిషేకం చేస్తున్న సినీనటి సుమయారెడ్డి

అలంపూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను తెలుగు సినీనటి సుమయారెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారి ఆలయంలో గణపతిపూజ, అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన వంటి విశేష పూజలు చేశారు. వీరికి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికారు.

ముగిసిన వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



స్వామివారిని ఊరేగిస్తున్న వేదపాఠశాల విద్యార్థులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సూర్యలక్ష్మీ కాటన్‌మిల్ ఆవరణలోని వేంకటేశ్వర స్వామి 33వ వార్షిక బ్రహోత్సవాలు పది రోజులుగా కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ముగింపు ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని సుందరంగా అలంకరించిన రథంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిల్లలమర్రి రోడ్డులో కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వాదం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వేంకటేశ్వర స్వామి సేవా సమితి అధ్యక్షుడు తోటపల్లి శ్రీకాంత్ శర్మ, ప్రధాన కార్యదర్శి గొండ్యాల రాఘవేందర్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మైసమ్మ దేవతకు భక్తిశ్రద్ధలతో పూజలు



మైసమ్మ దేవతను దర్శించుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవతకు ఈ ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల నలుమూలల నుంచే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం దాదాపు 30వేలకు పైగా భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకున్నారు. మైసమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తుల నుంచి మైసమ్మ తల్లికి టికెట్ల ద్వారా రూ.80వేలు, హుండీ ద్వారా రూ.1,46,060, మొత్తం 2,26,060రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఈవో రామేశ్వర్‌శర్మ తెలిపారు.

కాంగ్రెస్ అనుబంధ సంఘాల ఇన్‌చార్జీగా.. వంశీకృష్ణ, సంజీవ్ ముదిరాజ్

మహబూబ్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ కాంగ్రెస్ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సెల్ ఇన్‌చార్జిలుగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్‌రెడ్డి నియమితులయ్యారు. అదే విధంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.వేణుగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు ఎ.జంగారెడ్డి, వి.రామారావుగౌడ్, పృధ్విచౌదరి నియమితులు కాగా, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జిలుగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు బొజ్జ సంధ్యారెడ్డి, మహ్మద్‌అబ్దుల్ ఫహీం, ఎస్ శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు.

క్రైం కార్నర్

దేవుని పేరుతో చందాలు వసూలు

- వ్యక్తికి దేహశుద్ధి



చందా వసూలు చేస్తున్న వ్యక్తికి దేహశుద్ధి చేస్తున్న గ్రామస్తులు

వనపర్తి రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని రాజనగరం వడ్డెగేరిలో ఆదివారం దేవుని పేరుతో చందాలు వసూలు చేస్తున్న ఓ వ్యక్తికి గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. వనపర్తి మండల పరిధిలోని అచ్యుతాపూర్ గ్రామ శివారులోని శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయం ఉంది. ఆలయ నిర్మాణం కోసం పెబ్బేరు మండలం చెలిమిల్లకి చెందిన ఇద్దరు వ్యక్తులు పంచముఖి ఆంజనేయ స్వామి పేరు మీద చందా బుక్కులు ముద్రించి వసూలు చేస్తుండడంతో అనుమానం వచ్చిన కొందరు స్థానికులు ఆలయ ప్రధాన అర్చకులు రమేశ్ శర్మకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అయ్యగారు అచ్యుతాపూర్ గ్రామస్థులకు సమాచారం అందించడంతో గ్రామస్థులతో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. ఒకరిని పట్టుకోగా మరొకరు పరారయ్యాడు. అతనికి దేహశుద్ధి చేశారు. అతను నేను ఇంకోసారి చేయను అని ప్రాధేయపడటంతో మరోసారి ఇలాంటివి పునరావృతం కావొద్దని హెచ్చరించారు. వసూలు చేసిన డబ్బులు హుండీలో వేయాలని చెప్పి వదిలేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మదనాపురం, జూన్ 29, (ఆంధ్రజ్యోతి) : మండలంలో రాత్రి వేళలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున మండలంలోని కరివెన గ్రామ శివారులోని ఊకచెట్టు వాగులో నుంచి రెండు ట్రాక్టర్లు ఇసుకను ఆత్మకూర్‌కు తరలిస్తుండగా.. గోపన్‌పేట శివారులో వాటిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నీటి గుంతలో జారిపడి మహిళ మృతి



పద్మమ్మ (ఫైల్)

ఊర్కొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలం ఊర్కొండపేట శివారులో నీటి గుంతలో జారిపడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన చిక్కొండ పద్మమ్మ ఊర్కొండపేట శివారులోని రెడ్యాతండా సమీపంలోని స్వంత భూమిలో చిక్కొండ కోటయ్య పత్తిచేనుకు గుంటుక తోలుతున్నాడు. కోటయ్య భార్య చిక్కొండ పద్మమ్మ(40) అతనితో పాటు పత్తి చేనులో పని చేసుకుంటూ దాహం వేయగా సీసాలో నీళ్లు తీసుకురావడానికి నీటి గుంత వద్దకు వెళ్లి నీళ్లు తీసుకుంటుండగా కాలు జారి నీటిగుంతలో పడిపోయింది. చాలాసేపటి వరకు భార్య రాకపోయేసరికి ఆ సమీపానే పనిచేస్తున్న భర్త నీటిగుంత వద్దకు వెళ్లి చూడగా అందులో పద్మమ్మ కనిపించేసరికి లబోదిబోమంటూ రోదిస్తుండగా పరిసర ప్రాంత రైతులు అక్కడికి వచ్చి నీటిగుంతలో నుంచి తీసేసరికి అప్పటికే ఆమె మృతి చెందింది. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు.

బైక్, టిప్పర్ ఢీకొని యువకుడి మృతి



నవీన్‌కుమార్‌గౌడ్ (ఫైల్)

దేవరకద్ర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : బైక్, టిప్పర్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నాగన్న కథనం ప్రకారం.. దేవరకద్రకు చెందిన నవీన్‌గౌడ్ (25) మన్యంకొండ దగ్గర మిషన్ భగీరథలో పని చేసేవాడు. పని ముగించుకొని శనివారం రాత్రి తిరిగి దేవరకద్రకు వస్తుండగా పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు డీసీఎం దగ్ధం



కోస్గి చౌరస్తాలో దగ్ధమైన పత్తి డీసీఎం

కోస్గి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు పత్తి డీసీఎం దగ్ధమైన ఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మధ్యప్రదేశ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి వెళ్తున్న పత్తి డీసీఎంకి పట్టణంలోని వివేకానంద చౌరస్తాలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ భరత్ సింగ్ వాహనాన్ని పక్కకు నిలిపాడు. ఫైరింజన్ కు చేరుకునే లోపు డీసీఎం దగ్ధమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

రైల్లో నుంచి జారిపడి వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు రైలులోంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కోయిలకొండ మండలం ఇబ్రహీంనగరంకు చెందిన వెంకటేశ్‌గౌడ్ (35) తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. కారు డ్రైవర్‌గా పనిచేస్తూ పెళ్లిళ్లకు డెకరేషన్ పనిచేస్తాడు. ఈనెల 27న జడ్చర్లలో పెళ్లి డెకరేషన్ పని ఉందని ఇంటి నుంచి బయలుదేరాడు. పని పూర్తి చేసుకుని 28న రాత్రి జడ్చర్ల నుంచి హైదరాబాద్‌కు రైలులో వస్తున్నట్లు భార్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. కాగా జడ్చర్ల-గొల్లపల్లి మధ్యన వెంకటేశ్ ప్రమాదవశాత్తు రైలులోంచి కిందపడి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఉన్న వివరాలను తీసుకుని ఆదివారం మృతుడి భార్య సరితకు జరిగిన ప్రమాదం గురించి సమాచారం అందించడంతో ఆమె జనరల్ ఆసుపత్రికి చేరుకుంది. వీరికి ఇద్దరు మగపిల్లలున్నారు. మృతుడి భార్య సరిత రైల్వే పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

గద్వాలఅర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జూలై 1న మంగళవారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసన్న, కార్యదర్శి సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 6న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ అథ్లెటిక్స్ ప్రధాన స్టేడియంలో 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 10ఏళ్లలోపు, 12ఏళ్లలోపు, 14 సంవత్సరాలలోపు వారు పోటీలకు హాజరుకావాలని తెలిపారు.

ఆకలి తీర్చని 'హమాలీ'!

- నెలలో 15 రోజులే పని.. మిగతా రోజులు ఖాళీగా!
- 12 గంటలు పనిచేస్తే అయిదారు వందలకు మించని ఆదాయం
- అయిజలో 80 శాతం మంది హమాలీలకు సెంటు భూమి కరువే
- 20 ఏళ్లకే మోకాళ్లు, నడుము, ఒళ్లు నొప్పులతో శారీరక సమస్యలు
- ప్రమాదాలు జరిగితే చందాలు వేసుకుని బాగుచేసుకోవాల్సిన పరిస్థితి
- కార్మిక చట్టాలు, ఇన్సూరెన్స్‌లపై అవగాహన లేక నష్టపోతున్న హమాలీలు
- దినసరి హమాలీల కష్టాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం



లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న అయిజ హమాలీ కార్మికులు

అయిజ టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రెక్కాడితే కానీ డొక్కాడని దినసరి హమాలీల బతుకులు దినదిన గండంగా మారుతున్నాయి. నెలలో 15 రోజులు పని దొరికితే మరో 15 రోజులు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అయిజ పట్టణంలో దాదాపు కిరాణం, సిమెంట్, ఫర్టిలైజర్, ఐరన్, హోమ్‌నీడ్స్, వస్త్ర, మద్యం, గ్రానైట్, మార్బుల్, సాధారణ బండల దుకాణాలతో పాటూ ఇతరత్రా చిన్నా, చితకా వాటితో కలిపి 189 దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలన్నింటిలో లోడింగ్, అన్‌లోడింగ్ పనులకు గానూ 120 మంది గుర్తింపు పొందిన దినసరి హమాలీలు పనిచేస్తున్నారు. వీరంతా షిఫ్ట్ పద్ధతిలో రోజుకు 60 మంది విధుల్లో ఉంటున్నారు. మొదటి రోజు విధుల్లో ఉన్న 60 మంది హమాలీలు రెండవరోజు ఖాళీగా ఉండాలనే నిబంధన ఇక్కడ అమలులో ఉంది. వీరిలోనే మరో 15 మంది ప్రతిరోజు రాత్రి వేళల్లో వచ్చే వివిధ రకాల వస్తువులను లోడింగ్, అన్‌లోడింగ్ చేసేందుకు గానూ డ్యూటీ చేయాల్సి ఉంటుంది.

ప్రమాదపు అంచుల్లో పనులు...

ప్రతిరోజు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న క్రమంలో లారీలు, డీసీఎంలు, బొలెరోలు, ట్రాక్టర్‌లు, ఆటోలు, ఇతరత్రా వాహనాల పైకెక్కి వస్తువులను దింపటం కానీ, ఎత్తటం కానీ చేసే పనులు చాలా ప్రమాదంతో కూడుకున్నవి. వివిధ రకాల దుకాణాల నుంచి మెట్లపై నడిచి వస్తువును మోసుకు రావటం, మోసుకెళ్లటం కూడా చాలా ప్రమాదకరంగా ఉంటుంది. ఏ మాత్రం కాలు అదుపు తప్పినా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గత కొన్ని రోజుల క్రితం బుడ్డ ఈరన్న అనే హమాలీ కార్మికుడు సిమెంట్ బస్తా మోస్తూ దుకాణం మెట్లపై కాలు జారి గాయపడ్డాడు. మహేంద్ర అనే హమాలీ కాలుకు బీరువా రేకు తెగి నరాలు దెబ్బతిన్నాయి. కృష్ణ అనే కార్మికుడి కాలుపై బండలు పడి పెద్దగాయమై ఏడు కుట్లు పడ్డట్లు తోటి కార్మికులు చెబుతున్నారు. ఈ విధంగా నిత్యం ప్రమాదపుటంచుల్లోనే పనులు చేయాల్సి వస్తుందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

ఒళ్లు నొప్పులతో నిస్సారంగా...

20 ఏళ్ల వయసున్న వ్యక్తి రోజంతా శక్తిని మించిన బరువులు మోసి నిస్సత్తువ, నీరసంగా కనిపిస్తున్నాడు. సాయంత్రం విధులు ముగించేసరికి ఒళ్లంతా నొప్పులతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు ఒంటి నొప్పులు భరించలేక మద్యానికి అలవాటు పడుతున్నారు. మిగతా పనులు చేయలేక, వ్యవసాయం చేసుకుందామంటే భూముల్లేక 15, 16 ఏళ్ల వయసు నుంచి కొందరు హమాలీ పనుల్లో చేరుతున్నారు. వారికి 50 ఏళ్లు నిండే సరికి ఏపని చేసుకోలేని స్థితికి వస్తున్నారు.

అందుబాటులో ఉన్న బీమా పాలసీలు కొన్ని...

గుర్తింపు పొందిన బ్యాంకుల్లో ఖాతా కలిగిన వారికి 'ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన' (పీఎంఎస్‌బీవై) కింది ప్రమాదవశాత్తు వ్యక్తి మరణిస్తే ఏడాదికి రూ.20 చెల్లించి రూ.2 లక్షల జీవిత బీమా పొందవచ్చు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఖాతా ద్వారా అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన' (పీఎంజెజెబివై) నుండి సాధారణ మరణం అయినా ఏడాదికి రూ.500 చెల్లిస్తే రూ. 2 లక్షల బీమా పొందవచ్చు. పోస్టల్ శాఖలో కూడా రూరల్ లైఫ్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ల ద్వారా రూ.10 లక్షల జీవిత బీమాకు రూ.550, రూ. 15 లక్షల జీవిత బీమాకు రూ. 750 చెల్లిస్తే బీమా పొందే అవకాశం ఉంది.

రెండుకాళ్లలో రాడ్లు ఉన్నాయి



నా వయసు 35 సంవత్సరాలు. 15 ఏళ్లనుంచి హమాలీ పనులు చేస్తున్నాను. 3 ఏళ్ల క్రితం లారీలో నుంచి రాజస్థాన్ మార్బుల్ బండలు దింపుతుండగా అదుపుతప్పి రెండు కాళ్లపై పడ్డాయి. దీంతో మోకాలు పైభాగంలో రెండు కాళ్లకు ఎముకలు విరిగిపోయాయి. ఆపరేషన్ కోసం ఆరు లక్షలు ఖర్చయ్యాయి. దాదాపు నాలుగు లక్షలు సొంతంగానే పెట్టుకున్నాను. రెండు కాళ్లలో ఇప్పటికీ రాడ్లు ఉన్నాయి. అయినా కుటుంబ పోషణ కోసం హమాలీ పనులే చేస్తున్నాను. నాకు భార్య, ఇద్దరు బిడ్డలు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఎకరం పొలం ఉంది. దాన్నుంచి వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు సరిపోవటం లేదు.

- రామాంజి,
హమాలీ కార్మికుడు, అయిజ

భరించలేని ఒళ్లు నొప్పులు



ప్రతిరోజు దాదాపు 12 గంటలు పనులు చేయాల్సి వస్తుంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమై మళ్లీ రాత్రి 7 గంటలకు ముగిస్తాం. ఈ సమయాల్లో బండలు ఎత్తటం, మందు సంచులు, కిరాణం సరుకులు మోయటం, ఐరన్ లోడింగ్, అన్ లోడింగ్ చేయటం లాంటి ఇతరత్రా పనులు చేయటంతో సాయంత్రానికి శరీరమంతా నొప్పులు పుడతాయి. ఈ క్రమంలోనే కొందరు మద్యం సేవిస్తారు. లేకపోతే నొప్పులకు నిద్ర రావటం లేదని చెబుతారు. నేను కూడా 2003 నుంచి 22 ఏళ్లుగా హమాలీ కార్మికుడిగానే పనిచేస్తున్నాను. నాకు 43 ఏళ్ల వయసు ఉంటుంది. మరో ఆరేడేళ్లకు మించి హమాలీ పనులు చేయలేను.

- నాగరాజు,
హమాలీ కార్మికుడు, అయిజ

పొద్దంతా కష్టపడ్డా అరకొర ఆదాయమే...

అయిజ పట్టణంలో ప్రతిరోజు ఉదయం 7 గంటలతో హమాలీ కార్మికుల దినచర్య ప్రారంభవుతుంది. రాత్రి 7 గంటల వరకు పనిచేసిన తరువాతనే రాత్రి షిఫ్ట్ వారికి మిగిలిన పనులు అప్పగించి 12 గంటల తరువాత పనులు ముగిస్తున్నారు. రోజుకు 60 మంది కష్టపడితే రూ. 35 వేల నుంచి రూ.40 వేల వరకు హమాలీ చార్జీలు వసూలౌతున్నాయి. వాటిని ఇంటికి తిరిగెళ్లేటప్పుడు అందరు పంచుకుంటే ఒక్కొక్కరికి రూ.550 నుంచి రూ.650 వరకు అందుతున్నాయి. సీజన్ లేనప్పుడూ, శనివారం, ఆదివారం అయితే రూ.300 వస్తున్నట్లు చెబుతున్నారు. నెలరోజుల కష్టానికి గానూ రూ.15 నుంచి రూ. 17 వేలకు మించి ఆదాయం రావటం లేదని ఆవేదన చెందుతున్నారు. దీంట్లో వచ్చిన ఆదాయంతోనే పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు, ఆస్పత్రి ఖర్చులు. ఇంటి అద్దె, ఇతరత్రా అవసరాలు తీరక కొందరు అప్పులు చేసుకుంటున్నారు. అయిజ మునిసిపాలిటీలో పనిచేసే 120 మంది కార్మికుల్లో దాదాపు 80 శాతం మంది కార్మికులకు సెంటు వ్యవసాయ భూమి లేదు.

ప్రమాదం జరిగితే తలో వెయ్యి జమ...

హమాలీ కార్మికుల్లో ఎవ్వరికైనా అనుకోని ప్రమాదం జరిగితే ఒక్కొక్కరు వెయ్యి రూపాయలు చందాల రూపంలో జమచేస్తారు. ఇంకా కొంచెం ఎక్కువ ఖర్చయితే ఏ దుకాణం వద్ద ప్రమాదం జరిగితే ఆ దుకాణ యజమాని కూడా కొంత ఆర్థిక సాయం అందించి వైద్యానికి తోడ్పాటు అందిస్తాడు. కార్మికుల్లో లేబర్ కార్డులు కానీ, ఇన్సూరెన్స్ సౌకర్యం కానీ 20, 30 మందికి మించి లేవు. మిగతా వారందరికి ఇటువంటి సౌకర్యాలపై పెద్దగా అవగాహన లేదనే చెప్పవచ్చు.

కార్మిక చట్టాలపై కూడా వీరికి పూర్తిస్థాయిలో అవగాహన లేనట్లుగా ఉంది. ఏదైనా ప్రమాదం జరిగినా, అనారోగ్యం పాలైనా అయిదారు లక్షలు ఖర్చైతే చందాల రూపంలో వచ్చిన రూ, 1.50 లక్షల మినహాయిస్తే మరో రూ, 3.50 లక్షలు ప్రైవేటుగా అప్పులు చేయాల్సిన పరిస్థితులే ఉన్నాయి.

ర్యాలంపాడుపై సిట్టింగ్ జడ్జితో

విచారణ చేయించాలి

- రిజర్వాయర్ మరమ్మతులపై ఎన్నిరోజులు అబద్ధాలు చెబుతారు
- జూరాల ప్రాజెక్టు రోప్‌లు తెగిపోయినా పట్టించుకోరా?
- గద్వాల మాజీ ఎమ్మెల్యే డీకే భరత్‌సింహారెడ్డి



ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీకే భరత్‌సింహా రెడ్డి

ధరూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ర్యాలంపాడు రిజర్వాయర్‌పై ఇంకా ఎన్నిరోజులు అబద్ధాలు చెప్పి కాలయాపన చేస్తారని మాజీ ఎమ్మెల్యే డీకే భరత్‌సింహా రెడ్డి అన్నారు. గతంలో గట్టు లిఫ్ట్ రివ్యూ మీటింగ్‌కు వచ్చినపుడు ర్యాలంపాడు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేస్తామని చెప్పిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మళ్లీ ఇప్పుడు వచ్చి ఉత్తుత్తి మాటలు చెప్పి మరమ్మతులు చేస్తామంటూ నమ్మబలకడం విడ్డూరంగా ఉందన్నారు. ఆదివారం ర్యాలంపాడు రిజర్వాయర్‌తో పాటు జూరాల ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం భరత్‌సింహా రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ర్యాలంపాడు రిజర్వాయర్ నిర్మాణం కేవలం రెండు టీఎంసీలకు మాత్రమే డిజైన్ చేయబడిందని, ఏరోజు కూడా నాలుగు టీఎంసీల నీరును ఇప్పటివరకు నిల్వ చేయలేదన్నారు. ప్రస్తుతం నాలుగు టీఎంసీల నీరు ఆపాలంటే రిజర్వాయర్‌కు పడిన బుంగలను మరమ్మతులు చేయాలన్నారు. దీనిపై తాను గతంలోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని, అప్పటినుంచి ఈఎంసీ అధికారి మురళీధర్ రావు నిధులు చెల్లించడం లేదన్నారు. ఇప్పుడు జరిగే అన్ని పరిణామాలపై కూడా తాము స్పష్టంగా ఫిర్యాదు చేశామన్నారు. ఇందులో 300 పేజీల నివేదిక తమ దగ్గర ఉందని, ఇందులో ఏ ఒక్కటి అబద్ధమని చెప్పినా రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు. ర్యాలంపాడు రిజర్వాయర్‌పై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ జరిపిస్తే నిజాలు బయటకు వస్తాయని తెలిపారు. ఇప్పుడు ఉన్న నాయకులు అవగాహన లేకుండా మాటాడుతున్నారున్నారు. అనంతరం జూరాల ప్రాజెక్టును పరిశీలించి రిజర్వాయర్ వద్ద ఉన్న నాలుగు గేట్లకు సంబంధించి రోప్‌లు తెగిపోయి ఉన్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వం జూరాల జలాశయం వద్ద సిల్టులు తొలగిస్తామని రిజర్వాయర్‌ను ఖాళీ చేసి నేటి వరకు పనిచేయకపోవడం విడ్డూరమన్నారు. దానికి సంబంధించి స్వప్న కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారు ఎలాంటి పనులు చేయకపోయినా రూ.4కోట్లు దండుకున్నారని ఆరోపించారు.

ఉత్తమ్‌కుమార్ రెడ్డి పర్యటన ఉతుత్తిగానే ఉందని ఎద్దేవా చేశారు. నడిగడ్డకు ఆయువు పట్టు అయిన జూరాలతో పాటు గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు రిజ ర్వాయర్‌పై వివక్ష చూపిస్తున్నారన్నారు. ఇప్పటికైనా వాటిపై ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్య క్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు, సీనియర్ నాయకులు నెట్టెంపాడు రామచంద్రా రెడ్డి, సంజీవ్ భరద్వాజ్, కృష్ణంరాజు, రఘు గౌడ్ ఉన్నారు.

ఎమ్మెల్యే ఆరోపించినట్లు రెండెకరాలు చూపించాలి

- నిరూపించని పక్షంలో పరువునష్టం దావా వేయడానికి వెనకాడను
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి

జడ్చర్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ఏరియా ఆసుపత్రి వద్ద ఎమ్మెల్యే ఆరోపించినట్లుగా తన సోదరిపై రెండెకరాల భూమి ఎక్కడ ఉందో చూపిస్తే.. ఆ స్థలాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి ఇప్పిస్తానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి వెల్లడించారు. లేకుంటే పరువు నష్టం దావా వేయడానికి వెనకాడబోమని హెచ్చరించారు. అవగాహన లేకుండా మాట్లాడి అభాసుపాలు కావద్దని హితవు పలికారు. ఆదివారం జడ్చర్ల పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద పట్టా భూమిని లే ఔట్ చేసిన దాంట్లో 1200 గజాల స్థలాన్ని తన మేనల్లుడు కొనుగోలు చేశాడని, అసైన్డ్ భూమి కాదని సూచించారు. సర్వే నెంబరు 149లో 7 ఎకరాల భూమి ఉందని, అందులో 3 ఎకరాలు ఎక్స్ సర్వీస్‌మెన్‌కు, మరో నాలుగు ఎకరాలు అసైన్డ్ భూమి ఉందన్నారు. నాలుగు ఎకరాల్లో అసైన్డ్ దారులతో మాట్లాడి వారికి డబ్బులు ఇచ్చి రెండు ఎకరాలను ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వానికి ఇప్పించానని వివరించారు. ప్రభుత్వం, అధికారంలో ఉన్న ఎమ్మెల్యే మిగిలిన రెండెకరాలు అసైన్డ్ దారులతో మాట్లాడి తీసుకుని, ఏరియా ఆసుపత్రిలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మించాలని సూచించారు. ఏ ప్రొటోకాల్‌తో ఎమ్మెల్యే గారి మాతృమూర్తి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ప్రశ్నించారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని ఎర్రగుట్ట వద్ద 560 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించామని, అందులో ప్రస్తుతం కొందరు ఉన్నారని ఎమ్మెల్యే అన్నారని, వాటిలో అర్హులైన వారితో పాటు ఇళ్ల నిర్మాణంలో స్థలాలు కోల్పోయిన వారికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇస్తే సహకరిస్తామని తెలిపారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు పునరావాసం కింద 300 గజాల ప్లాటుతో పాటు రూ.11 లక్షల ప్యాకేజీని రూ.16.30 లక్షలకు పెంచేవిధంగా చేసానన్నారు. నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీని రూ.25 లక్షలు ఇప్పిస్తా అని ప్రకటించిన విధంగా ఇప్పించాలన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్లు నందకిశోర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, జ్యోతి, సతీష్, రఘురాంగౌడ్, బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్‌గౌడ్, పిట్టల మురళి, కోడ్గల్ యాదయ్య, రాంమోహన్, రఘుపతిరెడ్డి, శ్రీశైలం యాదవ్, హఫీజ్ పాల్గొన్నారు.

జూలై 2న ఎన్ఎస్‌వీ శిబిరం

- ప్రభుత్వ ఆసుపత్రిలో పురుషులకు కుట్టుకోతలేని ఆపరేషన్లు



సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రఘు

కందనూలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో జూలై 2న బుధవారం ఉదయం 11గంటలకు పురుషులకు ఎలాంటి కుట్టుకోత లేకుండా ఎన్ఎస్‌వీ (నో స్కాల్పెల్ వేసెక్టమి) కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ప్రత్యేక చికిత్స శిబిరం నిర్వ హిస్తున్నట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రఘు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు గతంలో సిజేరియన్ ప్రసవాలు జరిగి ఇబ్బందులు ఉన్న వారి భర్త ఫిట్స్ లేదా మూర్ఛరోగం ఉన్న వారి భర్త కుటుంబ నియంత్రణలో భాగంగా భార్య ఆరోగ్యం దృష్ట్యా మగవారు వేసెక్టమి ఆపరేషన్ చేయించుకోవాలని అయన సూచించారు. ఆపరేషన్ చేయించుకోదలచిన మగ వారు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, సెల్ నెంబరుతో హాజరు కావాలని తెలిపారు. వారికి ఎలాంటి కుట్టుకోత లేకుండా సుశిక్షితులైన ప్రత్యేక వైద్య నిపుణులచే ఎన్ఎస్‌వీ ఆపరేషన్ ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కేవలం 2 నుంచి 5నిమిషాల్లో ఆపరేషన్ చేసి ఉచితంగా మందులు ఇచ్చి పంపనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి హెల్ప్ డెస్క్ ఇన్‌చార్జి టి.యాదగిరి నేరుగా లేదాసెల్ నెంబరు 9014932408లో సంప్రదించాలన్నారు.

డాక్టర్‌కు మెమో జారీ

నాగర్‌కర్నూల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డ్యూటీలో ఉంటూ వీడియో గేమ్ ఆడుతుండడంతో వచ్చిన ఆరోపణలపై జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రఘుకు షార్ట్ మెమో జారీ చేశారు. డ్యూటీలో ఉంటూ ఆర్థోపెడిక్ డాక్టర్ అయేష సమ్మా వీడియో గేమ్ ఆడిందంటూ వివిధ ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తల ఆధారంగా జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆమెను వివరణ అడిగారు. తాను ఆర్థోపెడిక్ విభాగంలో పని చేస్తూ వేరే ఓపీకి వచ్చానని, అక్కడ ఫోన్ కాల్ రావడంతో స్క్రీన్ ఓపెన్ చేయగా వీడియో గేమ్ ఆప్షన్ వచ్చిందని, దానిని తొలగించే క్రమంలో అనేక ఆప్షన్లు పెట్టానని వివరణ ఇచ్చినట్లు సమాచారం.

20 అడుగులకు చేరిన

కోయిల్‌సాగర్ నీటిమట్టం

దేవరకద్ర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. గత కొన్ని రోజులుగా జూరాల నుంచి కృష్ణా జలాలు కోయిల్‌సాగర్‌కు చేరుకోవడంతో ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 32.5 అడుగులు కాగా, ఆదివారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో 20 అడుగులకు చేరింది. మరో 12.5 అడుగులు నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండే అవకాశం ఉండటంతో ఆయకట్టుదారులు ఆనందం వ్యక్తం చేశారు.

న్యూస్ బాక్స్

డ్రైనేజీ పనులు ప్రారంభం

జడ్చర్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ 3వ వార్డు సత్యనారాయణస్వామి ఆలయం కాలనీలో రూ.3 లక్షలతో నిర్మించే డ్రైనేజీ నిర్మాణం పనులను ఆదివారం మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత ప్రారంభించారు. కౌన్సిలర్ సతీష్, నాయకులు నర్సిములు, కాలనీవాసులు ప్రభాకర్, రాజేశ్, నరసింహ, రమేశ్, కృష్ణనాయక్, దిగంబరరావు, నార్యానాయక్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల బదిలీ

కోయిలకొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కోయిలకొండ ఎంపీడీవో కార్యాయంలో కొన్నేళ్లుగా సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న హరిశ్చంద్రారెడ్డి గండీడ్ మండలానికి ఇన్‌చార్జి ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. ఎంపీవోగా వచ్చిన బద్రునాయక్ బాధ్యతలు తీసుకోకపోవడంతో సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్‌రెడ్డికి ఇన్‌చార్జి ఎంపీవోగా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఆదేశాలు జారీ చేశారు.

రేపు జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా రామకృష్ణపూర్‌లో జూలై 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాలికల జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాలికల జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి భానుకిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి జిల్లా మినహా పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు పాల్గొనవచ్చని, 1-1-2009 నుంచి 31-12-2011 మధ్య పుట్టిన వారు ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. ఆధార్, బర్త్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 8 గంటలకు జిల్లా స్టేడియంలో రిపోర్టు చేయాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మూసాపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం రాచాల గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఆదివారం బీఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా.. ఆయన పంపించిన రూ.10 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

తాటిపర్తిలో జనసేన సభ్యత్వ నమోదు

భూత్పూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటిపర్తి గ్రామంలో జనసేన పార్టీ నాయకులు ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా సభ్యత్వ నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతుందన్నారు. నాయకులు శరత్‌గౌడ్, రమేష్, నరసింహ, చంద్రశేఖర్, కేశవ, కల్యాన్, సాయి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

జడ్చర్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ శాంతినగర్‌కాలనీ మార్కండేయ స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాదిమి శివకుమార్ పరిశీలించారు. విజయ్‌కుమార్, వేణుగోపాల్, శ్రీరామ్, మురళి, నరేశ్, మల్లేష్, రాజేశ్వర్‌రావు, లవకుమార్, అయ్యన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని ప్రకటించాలి

మిడ్జిల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల లోపే మిడ్జిల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని ప్రకటించేందుకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, పీసీసీ నియోజకవర్గ పరిశీలకులు సాంబయ్య, భాస్కర్ చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ లీగల్ సెల్ జిల్లా వైస్ చైర్మన్ గడ్డల రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు తమ స్వార్థపూరిత రాజకీయాల కోసం మండల అధ్యక్షుడి ఎన్నిక కాకుండా అడ్డుకొని పార్టీ కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తున్నారని ఆరోపించారు.

పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మిడ్జిల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా కోశాధికారి ఎన్నం మహేష్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మృతి చెందిన టీవీ జర్నలిస్టు స్వేచ్ఛ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు బాలయ్య, తిరుపతినాయక్, పాత్రికేయులు రాజేష్, సత్యనారాయణ గౌడ్, భీంరాజ్, శ్రీనివాసులు, బాల్‌నారాయణ, ఎల్మశెట్టి శ్రీనివాసులు, విజయ్ ఉన్నారు.

ముదిరాజు మహాసభ నాయకుల ఎంపిక

పాలమూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన నాయకులను ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు తెలంగాణ ముదిరాజు మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ వివరించారు. ఆదివారం జిల్లాలోని పలు చోట్ల ముదిరాజు మహాసభ గ్రామ కమిటీలకు నాయకులను ఎంపిక చేశామన్నారు. తెలుగుగూడెం అధ్యక్షుడిగా పారేష్, జమిస్తాపూర్ అధ్యక్షుడిగా బంటు రాజు ఎంపికయ్యారు. మండల అధ్యక్షుడు చంద్రుడు, జిల్లా ప్రచార కార్యదర్శి యాదయ్య, వెంకటరాములు పాల్గొన్నారు.

సౌకర్యాల లేమితో.. విద్యార్థుల అవస్థలు

» జడ్పీహెచ్ఎస్, పీఎస్‌లు ఒకే చోట

» ఇరుకు గదులతో విద్యార్థులకు తప్పని తిప్పలు » పట్టించుకోని అధికారులు



ఇరుకు గదిలో పాఠాలు వింటున్న విద్యార్థులు

చిన్నచింతకుంట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉంద్యాల గ్రామంలో జడ్పీహెచ్ఎస్, పీఎస్ పాఠశాలలు ఒకే చోట నిర్వహించడంతో గల కొన్నేళ్లుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యాల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మొత్తం 180 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యాబోధన కొనసాగుతోంది. ఇక్కడ కేవలం ఐదు తరగతి గదులున్నాయి. అవి కూడా విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా సరిపోవడం లేదు. చాలీచాలని గదులతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే జీవశాస్త్రం పోస్టు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు సైన్స్ బోధనకు దూరమవుతున్నారు. దీంతో పాటు మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీఎస్ పాఠశాలది ఇదే తీరు..

జడ్పీహెచ్ఎస్ పక్కనే పీఎస్ పాఠశాల ఒకే చోట ఏర్పాటు చేయడంతో ఉపాధ్యాయులు ఒకే తరగతి గదిలో రెండేసి క్లాసులు బోధిస్తూ అసౌకర్యానికి గురి కావడం గమనార్హం. ఈ పాఠశాలలో 180 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ 1 నుంచి 5వ తరగతి వరకు కేవలం రెండే తరగతి గదులు ఉన్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు.

సాయిమందిరాల అభివృద్ధికి కృషి చేయాలి

» షిర్డి సాయి భక్త వేదిక రాష్ట్ర చైర్మన్ ధనుంజయ్



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న భక్తులు



మాట్లాడుతున్న భక్తవేదిక రాష్ట్ర కార్యదర్శి మైనంపాటి ప్రసాద్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న సాయి మందిరాలను ట్రస్టు సభ్యులు సమష్టిగా అభివృద్ధి చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర సాయి భక్తవేదిక చైర్మన్ మంచుకంటి ధనుంజయ్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమీపంలోని ద్వారాకమయి మందిరంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సాయి మందిరాల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన పాల్గొని, మాట్లాడారు. సాయిమందిరాలలో గోశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ట్రస్టు సభ్యులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి, ఆలయాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రతీ రోజు ఆలయాల్లో పూజ కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహించాలన్నారు. ప్రతీ గురువారం ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి మంచుకంటి ప్రసాద్ మాట్లాడుతూ సాయిమాలలను ప్రోత్సహించాలన్నారు. 21, 41 రోజుల పాటు భక్తులు మాలలు ధరించేలా భక్తులను సిద్ధం చేయాలన్నారు. మల్లికార్జున్, సిద్ధు, గోవర్ధనాచారి, నరసింహ, సాయిరాం, హన్మంతు, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు హరిస్వామి, భజన మండలి కార్యదర్శి యాదయ్య, ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి గోవర్ధనాచారి, ట్రస్టు సభ్యులు చంద్రకాంత్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రసిడెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడి ఆశయాలు కొనసాగించాలి



మాట్లాడుతున్న రవికుమార్

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వీరశైవుల ఆరాధ్య దైవమైన బసవేశ్వరుడి ఆశయాలకు అనుగుణంగా నడుచుకుందామని జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్, లింగ బలిజ నాయకుడు కెఎస్ రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బసవ భవన్‌లో నిర్వహించిన పట్టణ వీరశైవ లింగాయత్ లింగ బలిజ కులస్తుల సర్వసభ్య సమావేశానికి ఆయన పాల్గొని, మాట్లాడారు. వీరశైవ లింగాయత్ లింగ బలిజలను ఓబీసీలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో అధిక సంఖ్యలో ఉన్న మనం ఏకతాటిపైకి వచ్చి సామాజిక, ఆర్థికంగా విద్యాపరంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. పట్టణ కమిటీని వచ్చే నెల నిర్వహించాలని తీర్మాణం చేశారు. వార్షిక నివేదికను సమర్పించి, బసవ భవన్ నిర్మాణ అభివృద్ధిపై చర్చించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోకల శివుడు, శంకర్‌లింగం, గౌరవ అధ్యక్షుడు వజ్రలింగం, వీరేశలింగం, చంద్రశేఖర్, వీరన్న, ఉమాదేవి, రాజసింహుడు పాల్గొన్నారు.

బోరు డ్రిల్లింగ్

జడ్చర్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోప్లాపూర్ కట్ట మైసమ్మ ఆలయం వద్ద తాగునీటి ఎద్దడి నివారణకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు ఆదివారం బోరును వేయించారు. రెండు ఇంచుల నీళ్లు పడటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

యువమోర్చా మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్

కోయిలకొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్‌ను నియమిస్తూ బీజేపీ జిల్లా నాయకులు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా శీకాంత్‌ను బీజేపీ నాయకులు పార్థసారథి, రాములుగౌడ్, వెంకట్రామరెడ్డి, వేణు, శ్రీధర్ అభినందించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని క్రిష్టియన్‌పల్లిలోని వారాహిమాత ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జూలై 5వ తేదీ వరకు విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు వినోద్‌కుమార స్వామి తెలిపారు. వారాహి మూల మంత్ర హోమం, పల్లకీ సేవ, మంగళ నిరాజనము నిర్వహించారు. పూజ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ అయ్యప్ప కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే పేదల కలలు సాకారం

భూత్పూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌తోనే పేదల కలలు సాకారమవుతాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మద్దిగట్ల గ్రామంలో 25 మంది ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని లబ్ధిదారుల ఇళ్లకు భూమి పూజ చేశారు. భూత్పూర్ మండలంలో 1500 ఇళ్ల ఎమ్మెల్యే జీఎంఆర్ మంజూరు చేయించారని ఆయన స్పష్టం చేశారు. దేవరకద్రకు కోర్టు మంజూరు కావడం సంతోషకరం అన్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు తమ్మన్న గౌడ్, మాజీ ఉపసర్పంచ్ శివ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భూపతిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని హంగులతో బాలుర జూనియర్ కళాశాల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : అన్ని హంగులతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల భవనంలో నూతన భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిర్మించిన ఒకేషనల్ జూనియర్ కళాశాల నిర్మాణానికి రూ.3.60 కోట్ల నిధులు తీసుకురావడంతో పాటు నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. జిల్లా గంథ్రాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ భగవంతచారి, ఒకేషనల్ ప్రిన్సిపాల్ నర్సింహులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి

విలువలతో కూడిన విద్య అందించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మర్లులో ఏర్పాటు చేసిన గీతం ఉన్నత పాఠశాలను ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ సుధారాణి, డైరెక్టర్ కృష్ణ, రిషి కళాశాల కరస్పాండెంట్ చంద్రకళ వెంకటయ్య పాల్గొన్నారు.

'అనుమతి లేని పాఠశాలకు విద్యాశాఖ అధికారులకు ఆహ్వానమా'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని మర్లులోగల విష్ణేశ్వర కాలనీ సమీపంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన గీతం ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవానికి జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్, మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్‌సింగ్ పేరుతో ఆహ్వానపత్రాలు, బ్యానర్ వేసి ప్రచారం చేస్తే విద్యాశాఖ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం సరికాదని ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు, శిశువికాస్ స్కూల్ కరస్పాండెంట్ మల్లేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పాఠశాలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం సరికాదన్నారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెంటయ్య



జడ్చర్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జడ్చర్ల పట్టణానికి చెందిన పెద్ది పెంటయ్య ఎన్నికయ్యాడు. హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర సంఘం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా సమీప అభ్యర్థిపై 191 ఓట్లతో విజయం సాధించాడు. జడ్చర్ల లయన్స్‌క్లబ్ సభ్యుడిగా, సిటీ కేబుల్ అధినేతగా, ప్రైవేట్ కొరియర్ నిర్వాహకుడిగా ఉన్న పెద్ది పెంటయ్య విజయం సాధించడంతో మున్నూరు కాపు సంఘం జిల్లా, జడ్చర్ల నియోజకవర్గం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

దేశ ప్రతిష్టతను పెంచేందుకు మోదీ కృషి



మన్ కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

మిడ్జిల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రతిష్టతను మరింతగా పెంచేందుకు ప్రధాని మోదీ నిరంతరం పరితపిస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కో-ఆర్డీనేటర్ నరేష్‌నాయక్ నాయకులతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ప్రధాని దేశంలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలతో పంచుకోవడం జరుగుతుంద న్నారు. రాములు, ఆంజనేయులు, శేఖర్, ఆంజి, నాగరాజు, పల్లె అరవింద్ ఉన్నారు.

● హన్వాడ : ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. మండలంలోని పెద్దదర్పల్లి, హన్వాడ గ్రామాల్లో మండల అధ్యక్షుడు లింగన్న, మాజీ అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు రఘురాంగౌడ్, బాలు, చంద్రశేఖర్, ప్రవీన్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

● జడ్చర్ల : ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. మండలంలోని మల్లెబోయిన్‌పల్లి బూత్ నెంబరు 54లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో వీక్షించారు. మన్‌కీ బాత్‌లో ప్రధాని సూచించిన అంశాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, చీకూరి శేఖర్, కాశన్న, నరేశ్, శివకుమార్, జగదీశ్, మురళినాయక్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి పాటుపడుదాం



మాట్లాడుతున్న మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో గల కాటమయ్య ఆలయ అభివృద్ధికి కృషి చేద్దామని మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం ఆలయ అభివృద్ధి పనులు పరిశీలించిన అనంతరం గౌడ కులస్తుల సమావేశంలో మాట్లాడారు. ఎలాంటి రాజకీయాలకు తావివ్వకుండా సమష్టిగా అభివృద్ధి చేసుకుందామన్నారు. మనందరం కలిసి గౌడ కులస్తుల అభివృద్ధితో పాటు సమాజ ఉద్ధరణకు పాటుపడుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, కోఆపరేటివ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజగౌని శ్రీధర్‌గౌడ్, వెంకటస్వామి గౌడ్, సాయిలుగౌడ్, రాజయ్యగౌడ్, పురోషోత్తంగౌడ్, చెరుకు వెంకటేష్‌గౌడ్, జెమిని శేఖర్ గౌడ్, గుముడాల నరేందర్‌గౌడ్, వినోద్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

భూత్పూర్ మునిసిపాలిటీలో సంపూర్ణ అభివృద్ధి



100 రోజుల కార్యచరణ ప్రణాళికపై మాట్లాడుతున్న నవీన్‌గౌడ్

భూత్పూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మునిసిపాలిటీల్లో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 100 రోజల కార్యచరణ ప్రణాళికతో మునిసిపాలిటీల్లో సంపూర్ణ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్ అన్నారు. ఆదివారం మునిసిపాలిటీలోని రాజీవ్ స్వగృహ కాలనీలో 100 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లిక్కీ నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ 100 రోజుల కార్యచరణ ప్రణాళికపై అవగాహన కల్పించారు. పారిశుధ్యంపై ప్రతీ ఒక్కరు దృష్టి సారించాలని కమిషనర్ నురూల్ నజీబ్ సూచించారు. చెత్త తీసుకెళ్లడానికి వచ్చే వాహనాల్లోనే చెత్త వేయాలన్నారు. అనంతరం కాలనీవాసులకు కమిషనర్ తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. నాయకులు పవన్‌కుమార్, బోరింగ్ నర్సిములు, నరేందర్, గడ్డం ఎల్లప్ప పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్

హన్వాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు వాటిల్లుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని దాచకపల్లిలోని దయ్యాల మర్రితండాలో సీపీఐ హన్వాడ మండల నాలుగో మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చాక ప్రజలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆపరేషన్ కగార్ అమలుతో ఆదివాసులు, గిరిజనులను అంతమొందిస్తున్నారని మండిపడ్డారు. దేశ సహజ వనరులను బాహుళ జాతి కంపెనీలకు అప్పచెప్పుతున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. అంతకుముందు అరుణోదయ పతాకాన్ని ఆవిష్కరించి అమరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శంకర్‌నాయక్, జిల్లా, మండల నాయకులు సురేష్, ఆనంద్, రాజునాయక్, శ్రీనివాస్, భగవంత్, రామస్వామి, శశికళ, లక్ష్మన్, శాలిబాయి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను సన్నద్ధం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ప్రసాద్

పాలమూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులను సన్నద్ధం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో 'కార్మిక వర్గం ఎదుర్కొనబోయే లేబర్ కోడ్లు' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్మిక వర్గం బ్రిటీష్ వలస పాలనలో సాధించుకున్న కార్మిక చట్టాలను హక్కులను నేటి బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్ తీసుకొచ్చి 29 కార్మిక చట్టాలను తొలగించిందన్నారు. వచ్చేనెల 9న జరిగే 22వ దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయటంలో కార్మికులు ముందు ఉండాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దీప్లానాయక్, కురుమూర్తి, రాజ్‌కుమార్, చంద్రకాంత్, గాలెన్న, సత్యన్న, వర్షాబేగం, వెంకటేష్‌గౌడ్, జగన్, హనుమంతు, జి.రాములు, ఖమర్ అలీ పాల్గొన్నారు.

ప్రకృతిని, ప్రతీ జీవిని ప్రేమించాలి



అయ్యప్పకొండపై బుద్ధుడి విగ్రహ స్థాపనలో పాల్గొన్న ప్రజలు

పాలమూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని ప్రతీ ఒక్కరు ప్రకృతిని, ప్రతీ జీవిని ప్రేమించాలని మహామాయ గౌతమ బుద్ధ విహార్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆదిలక్ష్మయ్య సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అయ్యప్పకొండ మీద బుద్ధుడి విగ్రహాన్ని స్థాపించారు. పంచశీల ప్రత్యేకతను వివరించారు. మూఢనమ్మకాలు పాటించకూడదని, ఏ ప్రాణికి హానికలగకుండా చూడాలన్నారు. కరుణ, దయతో మెలగాలని, అడగకుండా ఏదీ తీసుకోకూడదన్నారు. తప్పుడు మార్గంలో ప్రయాణించకూడదన్నారు. అష్టాంగ మార్గాలను పది పారామితులను వివరించారు. అంబేడ్కర్ ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు మంగనూరు వెంకటేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వమించగా, ప్రధాన కార్యదర్శి వడ్డెమాన్ బాలపీరు, తిరుపతయ్య, గంధం సంజీవయ్య, శ్రీదేవి, రాజేందర్, బాలస్వామి పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన'

పాలమూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడుతామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య హెచ్చరించారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారం ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకపోవడం సరైందికాదన్నారు. పట్టాలిచ్చిన ఇళ్లను అందజేయకుండా నేటి ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. జర్నలిస్టులపై ప్రభుత్వం, స్థానిక జిల్లా అధికార యంత్రాంగం వివక్ష చూపటం సరికాదన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులిపలుపుల ఆనందం, బండి విజయ్‌కుమార్, పల్లాల జగన్, కార్యదర్శి తస్నీరు శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యుడు కుడితాడు బాపురావు, జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు వాకిటి శ్రీహరి, గోపాల్, యాదగిరి, ఎండీ రఫీ, ఉమామహేశ్వరరావు, గోపాల్, గోకులం రవి, వెంకటేష్, యంవీ రమణ, అనిల్, శ్రీనివాస్, రమాకాంత్‌రెడ్డి, మైపాల్ రెడ్డి, రవీందర్, రఘు, రవి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.